# ఎలుకలవలె...... కోతుల వలె...!

యాగం లేనిదే యోగంలేదని అనుకున్నాడు వేదకాలం నాటి మానవుడు. పిల్లలు లేకపోతే పుత్రకామేష్ఠి యాగం చేశాడు దశరథుడు. రాజ్యవిస్తరణ కోసం అశ్వమేధయాగం చేశాడు రాముడు.



మానవుడు ఏది చేసినా ఒక ప్రయోజనం కోసమే చేశాడు. నమ్మకతో చేసినవి కొన్నయితే, నిర్దుష్టతతో చేసినవి మరికొన్ని.

నిరుష్టతకు నమ్మిక ఒక్కటే చాలదు.

అందువల్లే, ఆధునిక మానవుడు ప్రయోగాలు లేనిదే ప్రగతి లేదని నమ్మడమే కాకుండా నిరూపించాడు.

యాపిల్ పండు కిందపడడాన్ని చూసిన ఒక శాస్త్రవేత్త భూమికి గురుత్వాకర్షణ శక్తివుందని నమ్మి, అనేక ప్రయోగాలు చేసి నిరూపించాడు.

కాగుతున్న వంటపాత్రలోని నీటిపై కదులుతున్న ప్లేటు చూసి, ప్రయోగాల మీద ప్రయోగాలు చేసి రైలింజనును రూపొందించాడు మరొక శాస్త్రవేత్త.

ఎగిరే పక్షిని చూసి మరో శాస్త్రవేత్త విమానాన్ని తయారు చేశాడు.

అలాగే ఎన్నెన్నో ప్రయోగాలు చేసి ఒకడు విద్యుచ్ఛక్తిని కనిపెడితే, మరొకడు రేడియో వినిపించాడు. ఇంకొకడు టెలిఫోన్‌ను కనుగొన్నాడు.

తన బిడ్డ ముద్దుమాటల్ని మళ్ళీ మళ్ళీ వినాలనే తపనతో గ్రామఫోన్‌ను కనిపెట్టాడు ఇంకో శాస్త్రవేత్త. కొన్నాళ్ళకు దానిని అధిగమించి టేప్ రికార్డర్‌ను రూపొందించాడు మరో శాస్త్రవేత్త. ఖగోళ శాస్త్రవేత్తలు ఎన్నో రకాల ప్రయోగాలు చేసి అంతరిక్ష రహస్యాల్ని వెలుగులోకి తెచ్చారు.

వెచ్చని ఎండనిచ్చే సూర్యుణ్ణి, చల్లని వెన్నెలనిచ్చే చంద్రుణ్ణి అలనాడు దేవుళ్ళుగా చేశారు కొందరు. అది తప్పని ఖగోళ శాస్త్రజ్ఞులు తమ ప్రయోగాలద్వారా నిరూపించారు. సూర్య, చంద్రులు గ్రహాలని ధ్రువీకరించారు. సూర్యగ్రహం అగ్నిగోళమనీ, చంద్రగ్రహం శిలలమయమనీ నిరూపించి అందర్నీ నిశ్చేష్టుల్ని చేశారు.

నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రమండలం మీద కాలుమోపి తిరిగి వచ్చాడు కూడా.

ఒక మీట నొక్కితే వెలిగే దీపం, మరో మీట నొక్కితే వెలువడే శబ్దం, ఇంకో మీట నొక్కితే తిరిగే యంత్రం ఎన్నెన్నో ప్రయోగాల ఫలితం. ఇవన్నీ మన కోసం, మన సుఖం కోసం, మన అవసరం కోసం.

భౌతికావసరాల కోసం, మానసికావసరాల కోసం తత్వవేత్తలు ఎన్నో ప్రయోగాలు చేశారు. వేదాలు..... ఉపనిషత్తులు.. ద్వైతం.... అద్వైతం... మతాలు.... హిందూమతం, బౌద్ధమతం, జైనం.... ఇస్లాం, క్రైస్తవం.... క్రిష్టియానిటీ... ఫ్రాయిడిజం... సర్రియలిజం.....

ఎన్నో తత్వశాస్త్రాలు, ఆర్థిక శాస్త్రాలు మథించి మార్క్సిజం రూపొందించాడు మార్క్స్... దాన్ని తమ దేశ ప్రజల అవసరాలకోసం అమలు చేయడానికి లెనినిజం, మావోయిజం పుట్టుకొచ్చాయి.

ఇక ఆరోగ్యమే మహాభాగ్యం అని నమ్మిన వైద్యశాస్త్రకారులు మరెన్నో ప్రయోగాలు చేశారు. ఆయుర్వేదం..... అల్లోపతి.... హోమియోపతి.... ఆక్యుపంక్చర్.... దేని విశిష్టత దానిది!

అల్లోపతి వైద్యంలో ఔషధాల తయారీకి ఎన్ని ప్రయోగాలు చేస్తూ వస్తున్నారో.... ఒక మందు కనిపెట్టడానికి ఇంకెన్నో ప్రయోగాలు.. అవి కోతుల మీద, కుందేళ్ళ మీద ప్రయోగాలు....

పెన్సిలిన్ కనిపెట్టినా ఇన్సులిన్ శోధించినా సారిడాన్ రూపొందించినా అనాలజిన్‌ను ఆపు చేసినా ముందూ, వెనుకా ప్రయోగాలు తప్పనిసరి.

ఎలుకలు, కోతులు వంటి వాటి ప్రాణాలమీద ప్రయోగాలు చేయడం మానాలని జీవకారుణ్యవాదులు వాదిస్తూనూ ఉన్నారు.

మనిషి బతకడానికి మొదటి అవసరం ఆహారం కాబట్టి, రకరకాల వంగడాల కోసం కొన్ని జంతువుల మీద ప్రయోగాలు చేయకతప్పదని కొందరు సమర్థిస్తూనూ ఉన్నారు.

ప్రయోగాలు కూరగాయల కోసం జరిగాయి. పొటాటో దగ్గర నుంచి టమాటా వరకూ, కాలిఫ్లవర్ నుంచి సన్‌ఫ్లవర్ వరకూ, మిరపకాయ నుంచి వంకాయ వరకూ పెద్దవి తయారుకావడం కోసం ప్రయోగాలు జరిగాయి.

వరి వంగడాల అధిక దిగుబడికీ ఎన్నో కొత్తరకాల విత్తనాల తయారీకీ అనేక ప్రయోగాలు జరిగాయి.

ఇప్పుడు టెర్మినేటర్ విత్తనాల ప్రయోగాలు మొదలయ్యాయి. సోయాబీన్స్ నుంచి పత్తి వరకూ ప్రయోగాత్మకంగా పండించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అమెరికాకు చెందిన బహుళజాతి విత్తనాల సంస్థ మోన్‌సాంటో ఆ ప్రయోగాలు ప్రారంభించింది.

ఈ సంస్థ రూపొందించిన సోయాబీన్స్ విత్తనాలవల్ల జరిగే నష్టం తెలుసుకొని యూరోపియన్ యూనియన్, చైనా ఇప్పటికే తిరస్కరించాయి. అయితే, మన ప్రభువులు మాత్రం మిలియన్ టన్నుల సోయాబీన్స్ విత్తనాల దిగుమతికి అనుమతించింది.

ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లో మోన్‌సాంటోకు వత్తాసుపలుకుతున్నారు. అయితే, మోన్‌సాంటో మాయమాటలు చెప్పి తమను మోసం చేసిందని అమెరికాలోని టెక్సాస్ రైతులే కంపెనీపై కేసులు వేశారు. బహుశా అందుకే మోన్‌సాంటో మనలాంటి వర్ధమాన దేశాలపై ప్రయోగాలు చేస్తోంది.

కొన్ని ఔషధ సంస్థలు తమ మందుల మంచిచెడ్డల ప్రభావం తెలుసుకోవడానికి ఎలుకలు, కోతులపై ప్రయోగాలు చేసినట్టే మనలాంటి దేశాలపై మోన్‌సాంటో చేస్తోందన్నమాట. అంటే, మన లాంటి దేశాలు ఎలుకలు, కోతుల్లాగ దానికి కనిపిస్తున్నాయి అన్నమాట.

మరింత చైతన్యంతో మనం ముందుకు కదలకపోతే మహాకవి శ్రీశ్రీ గేయాన్ని కొద్దిగా మార్చి "మనదీ ఒక దేశమేనా / ఎలుకలవలె, కోతులవలె/ మనదీ ఒక దేశమేనా/సందులలో పందులవలె" అని విషాద గీతాలాలపించక తప్పదు.

11-12-98

వార్త దినపత్రిక,